సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 6 । ఏప్రిల్ । 2024



వెయ్యి నెలల పుణ్య ఫలం బడీరాత్

లైలతుల్ ఖదర్...వెయ్యి నెలలకు పైగా పుణ్య ఫలం లభించే రేయి. దీనిని ముస్లింలు బడీరాత్ (పెద్దరాత్రి) అని కూడా అంటారు.

-IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
రాయచోటి :	6.30	4.51
రాజంపేట :	6.32	4.48
పీలేరు :	6.36	4.43
మదనపల్లె :	6.33	4.51

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	417	460
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 320.00 కిలోలు

న్యూస్‌రీల్

వీరభద్రుడి సేవలో న్యాయమూర్తులు



న్యాయమూర్తులను సన్మానిస్తున్న అర్చకులు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని శుక్రవారం వైఎస్సార్ జిల్లా అడిషనల్ సివిల్‌జడ్జి ప్రదీప్ కుమార్, ప్రిన్సిపల్ జడ్జి కవిత దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వీరికి స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి వివరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వీరిని ఘనంగా సన్మానించారు.

వైభవంగా ఊరేగింపు



పురవీధుల్లో ఊరేగుతున్న అన్నమాచార్యుడి ఉత్సవ విగ్రహం

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు వర్ధంతి మహోత్సవాల సందర్భంగా తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద టీటీడీ అధికారులు ప్రత్యేక సంగీత,అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లపాకలో అన్నమాచార్యుని ఉత్సవమూర్తిని పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. అలాగే అన్నమాచార్య ధ్యానమందిరం వేదిక వద్ద సప్తగిరిగోష్టి గానం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

కాచిగూడకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కాచిగూడ–తిరుపతి–కాచిగూడ (07653/07654) మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌లు తెలిపారు. ఈనెల 11, 18, 25, మే 1 తేదీల్లో కాచిగూడ నుంచి తిరుపతికి, ఏప్రిల్ 12, 19, 26, మే 2వ తేదీల్లో తిరుపతి నుంచి కాచిగూడకు ఈ ప్రత్యేక రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ రైలు ప్రతి గురువారం రాత్రి 10.30 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.05 గంటలకు కడప మీదుగా తిరుపతికి చేరుతుందన్నారు. ప్రతి శుక్రవారం తిరుపతిలో రాత్రి 8.05 గంటలకు బయలుదేరి కడపకు 10.25 గంటలకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడకు చేరుతుందన్నారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

కడప అర్బన్: జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కడప రిమ్స్ పీఎస్ సీఐ కె.రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఎర్రన్న, ఏఎస్‌ఐ యోగా రాయల్, సిబ్బంది 'సశస్త్ర సీమా బల్' (ఎస్.ఎస్.బి) బలగాలతో కవాతు నిర్వహించారు. ఆర్‌కె నగర్, తిలక్‌నగర్, చలమారెడ్డిపల్లె, బీడీ కాలనీ ప్రాంతాల మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో వున్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతా వరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు.

విధులకు గైర్హాజరుపై ఆగ్రహం



ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

సంబేపల్లె: మండల పరిధిలోని దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి కొండయ్య తనిఖీ చేశారు. అక్కడ ఇద్దరు విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా ఇద్దరు డాక్టర్లు ఒకేరోజు గైర్హాజరయ్యారు. వైద్యంకోసం వచ్చిన వారు సిబ్బంది వద్ద మందులు మాత్రమే తీసుకొని వెళ్లారు. ఇద్దరు డాక్టర్లకు ఫోన్‌చేసి సెలవు లేకుండా ఎందుకు విధులకు గైర్హాజరయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లెవించిన ప్రగతి



- ఐదేళ్లలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా జిల్లాకు 4,910 అభివృద్ధి పనులు మంజూరు
- వాటి పూర్తికి రూ.1,163.36 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



కురబలకోట మండలం కనసానివారిపల్లెలో ఒకేచోట సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్‌క్లినిక్ భవనాలు

బి.కొత్తకోట: గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం కోసం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. జిల్లాల పునర్విభజనకు ముందు, తర్వాత ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో అభివృద్ధికి బాటలు వేసింది. ఒకప్పుడు ఏ ఎమ్మెల్యే అయినా ఏదైనా ఒక అభివృద్ధి పని మంజూరు చేయిస్తే అదో విశేషంగా చెప్పుకునే వాళ్లు. ఈ ప్రభుత్వంలో ఐదేళ్లలో అభివృద్ధి జరగని గ్రామం ఉందా అని చర్చించుకునే పరిస్థితి వచ్చింది. అన్నమయ్యజిల్లాలో 2019 నుంచి 2024 మార్చి వరకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనుల విలువ అక్షరాలా రూ.1,163.36 కోట్లు. ఒకశాఖకే ఈస్థాయిలో నిధులు కేటాయించబడటం అరుదైన విషయం కూడా. ఈ నిధులు ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌కు సమానం.

రూ.678 కోట్ల పనులు పూర్తి

వివిధ కార్యక్రమాలు, పథకాల ద్వారా ప్రభుత్వంతో పాటు కేంద్రానికి చెందిన ఉపాధి హామీపథకం, ఎంపీ ల్యాడ్స్ నిధులు కొంత కలుపుని వైఎస్.జగన్ ప్రభుత్వం జిల్లాకు 4,910 అభివృద్ధి పనులను మంజూరు చేసింది. వీటిని సత్వరమే పూరిచేసేందుకు రూ.1,163.36 కోట్ల నిధులు కేటాయించింది. ఐదేళ్లలో జిల్లాలోని పంచాయతీరాజ్ సబ్‌డివిజన్లు బి.కొత్తకోట, మదనపల్లె, కోడూరు, వాయల్పాడు, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట ద్వారా మండలాల్లో పనులు చేపట్టారు. ఇందులో రూ.678.76 కోట్ల నిధులు ఖర్చు చేసి 2,541 పనులు పూర్తి చేశారు. రూ.316.76 కోట్ల విలువైన 843 పనులు పురోగతిలో ఉన్నాయి. వీటిలో రూ.142.10 కోట్ల విలువైన 1,514 పనులు ఇంకా ప్రారంభంకాలేదు.

కళ్లకు కట్టేలా అభివృద్ధి

జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. తారురోడ్ల మొదలు, వీధుల్లో సిమెంట్ రోడ్లు, మురికినీటి కాలువలు, ప్రహరీగోడలు, కల్వర్టులు, పక్కా భవనలు ఉన్నాయి. పల్లె కేంద్రంగా పాలన సాగించే సచివాలయ భవనాలు, వైద్యం అందించే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, విజ్ఞానం అందించే డిజిటల్ లైబ్రరీలు, రైతులు అన్ని రకాల ఎరువులు, పురుగుల మందులు లభించే రైతు భరోసా కేంద్రాలు, పల్లెల్లో పాలవెల్లువ కోసం బల్క్‌మిల్క్‌చిల్లింగ్ యూనిట్లు, ప్రజలకు ఉపయోగపడే సామాజిక భవనాల నిర్మాణం చేపట్టారు. ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి పనులు కళ్లకు కట్టేలా కనిపిస్తున్నాయి.

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు

పథకం	పనులు	నిధులు (రూ.కోట్లలో)	పూర్తయినవి	చేసిన ఖర్చు (రూ.కోట్లలో)
జీజీఎంపీ	1,835	51.10	946	26.64
ఎంపీ ల్యాడ్స్	238	10.25	126	5.34
డీఎంఎఫ్	133	10.22	96	7.33
సీఎస్ఆర్	92	6.36	49	3.22
సీఎండీఎఫ్	41	1.62	34	1.42
పీఆర్ఆర్	06	7.24	03	5.20
పీఎంజీఎస్‌వై	23	58.95	13	43.76
ఎన్ఆర్‌జీఎస్	356	25.95	324	23.03
ఎన్ఆర్‌జీఎస్	497	16.76	143	4.69
ఈఏపీ	611	672.80	331	401.05
జీఎస్‌బీ	368	160.44	292	114.58
ఆర్‌బీకే	324	77.56	263	56.66
వైఎస్సార్‌హెచ్‌కే	210	43.68	153	28.64
డిజిటల్ లైబ్రరీ	236	37.76	04	0.64
బీఎంసీయూ	247	41.41	14	2.40
ఇతరా గ్రాంట్లు	35	18.76	13	10.78

3 మండలాలు కలిపే రోడ్డు

కొత్తగా తారురోడ్ల నిర్మాణంలో ఒక రోడ్డు మూడు మండలాలను కలిపింది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు పంచాయతీ నుంచి కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె మీదుగా బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీలోని చెన్నై–ముంబై జాతీయరహదారిలోకి కలిసేలా నిర్మించిన 16 కిలోమీటర్ల తారురోడ్డుతో మూడు మండలాలకు ప్రయోజనం కలిగింది. రూ.8.50కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్డు నిర్మాణంవల్ల 50 కుగ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడింది. 2019 నుంచి 2023 వరకు 366 పనుల కింద 500 కిలోమీటర్ల తారురోడ్లు మంజూరు చేశారు. ఇందులో 400 కిలోమీటర్లు కొత్త తారురోడ్ల నిర్మాణం ఉండగా 320 కిలోమీటర్ల తారురోడ్లు నిర్మాణాలు పూర్తి చేశారు. దీనికి ప్రభుత్వం రూ.399.32 కోట్లు కేటాయించింది.



తంబళ్లపల్లె-కురబలకోట-బి.కొత్తకోట మండలాలను కలిపే తారురోడ్డు

కడపలో హీరోయిన్ శ్రీలీల సందడి



కళ్యాణ్ జ్యువెలర్స్ షోరూం ప్రారంభిస్తున్న సినీనటి శ్రీలీల

కడప కార్పొరేషన్: కడప నగరంలో ప్రముఖ సినీనటి శ్రీలీల సందడి చేసింది. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా సరికొత్తగా తీర్చిదిద్దిన కళ్యాణ్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వసనీయత, నిజాయితీ, కస్టమర్ల పట్ల నిబద్ధత కలిగిన కల్యాణ్ జ్యువెలర్స్ బ్రాండ్‌కు ప్రాతినిధ్యం వహించగలగడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. ఇక్కడి ఆభరణాల ప్రేమికులను కల్యాణ్ జ్యువెలర్స్ ఆకట్టుకోగలదని తెలిపారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ రమేష్ కల్యాణరామన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్తగా తీర్చిదిద్దిన కల్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను ప్రారంభించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు తగ్గట్లుగా ఆభరణాలను అందించే సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తేవడం, వారికి అత్యుత్తమ షాపింగ్ అనుభూతిని కలిగించడమే తమ లక్ష్యమన్నారు. విశ్వసనీయత, పారదర్శకత అనే మూలసూత్రాలకు కట్టుబడి ఉంటూనే కస్టమర్లకు ప్రపంచ స్థాయి అనుభూతిని అందించేందుకు ఎప్పటికప్పుడు తమను తాము సరికొత్తగా తీర్చిదిద్దుకుంటూనే ఉంటామన్నారు. కల్యాణ్ జ్యువెలర్స్ హౌస్ బ్రాండ్స్‌లో ముహూరత్ (వెడ్డింగ్ జ్యువెలరీ కలెక్షన్), ముద్ర (హ్యాండ్‌క్రాఫ్టెట్ యాంటిక్ జ్యువెలరీ), నిమహ్ (టెంపుల్ జ్యువెలరీ) అనోఖి (అన్‌కట్ డైమండ్స్) లభిస్తాయని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం





జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ బి కృష్ణారావు

రాయచోటి: స్వాతంత్య్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్ రామ్ మహోన్నతమైన సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి జాకీర్ హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

అలుపెరుగని పోరాట యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా ఎస్పీ బి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రాయచోటిలోని పోలీస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ సమ సమాజస్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ విబి రాజ్ కమల్, ఏఏఓ కృష్ణుడు, ఎస్‌బీ సిఐ సత్యనారాయణ, ఏఆర్‌ఆర్‌ఐలు పెద్దయ్య, శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ఘన నివాళులు అర్పించారు.

జగనన్నను ముస్లింలు ఆశీర్వదించాలి

ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపు



సుండుపల్లెలో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ మిథున్‌రెడ్డి

సుండుపల్లె(రాజంపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రంలోని ముస్లిం వర్గాలు ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని రాజంపేట పార్లమెంటు సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం సుండుపల్లెలోని కేకే కల్యాణమండపంలో నిర్వహించిన రంజాన్ ప్రార్థనలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుండుపల్లె ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందుకు ఎంపీతోపాటు రాజ్యసభ సభ్యుడు మేడారఘునాథరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాలివీటి విజయసాగర్‌రెడ్డి(మదన్‌రెడ్డి), ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా మధుసూదన్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, యర్రపురెడ్డిఅజయ్‌రెడ్డి, మహిళనేతలు అజంతమ్మ, రెడ్డమ్మ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

- అంతకుముందు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్

- విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు
- అన్ని పాఠశాలల్లో అమలుకు విద్యాశాఖ ఆదేశాలు



వాటర్‌బెల్ సమయంలో నీళ్లు తాగుతున్న విద్యార్థులు



మదనపల్లె సిటీ: పాఠశాలల్లో సమయ పాలన పాటించేందుకు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు విద్యాశాఖ ముందు జాగ్రత్తలు చేపట్టింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గత ఏడాదితో పోల్చితే రెండు,మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయానికి విద్యార్థులు తాగునీరు తాగే విధంగా వాటర్‌బెల్ విధానాన్ని పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో వాటర్‌బెల్స్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్ విధిగా వాటర్‌బెల్స్ పాటించే విధంగా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసి, అమలుకు జిల్లా, మండల స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. విద్యార్థులు నీటిని తాగేందుకు వీలుగా రోజులో మూడు సార్లు వాటర్ బెల్ మోగించాల్సి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు, తిరిగి 10.45, చివరగా 11.50 గంటలకు వాటర్ బెల్ మోగించి, విద్యార్థులు నీరు తాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వులననుసరించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలల్లో వాటర్‌బెల్ కార్యక్రమం అమలు చేస్తున్నారు.

నేటి నుంచి వార్షిక పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు 6 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 1 నుంచి 5 వ తరగతి వరకు ఈనెల 6 నుంచి 16 వరకు, 6 నుంచి 9వ తరగతులకు 6 నుంచి 19 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.1 నుంచి 6వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 6,7,8 తరగతులకు 9 నుంచి 12 గంటలకు పరీక్షలు ఉంటాయి. 9వ తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

24 నుంచి వేసవి సెలవులు

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు అన్ని యాజమాన్య పాఠశాలలలకు వేసవి సెలవులు ప్రకటించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పదోతరగతి వార్షిక పరీక్షలు పూర్తయి మూల్యాంకనం కూడా జరుగుతోంది. ఇక 1–9 తరగతుల విద్యార్థులకు ఈనెల 6 నుంచి 18 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. 19 నుంచి 21లోపు ఆయా పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. చివరి రోజు ప్రొగ్రెస్ కార్డులు విద్యార్థులకు అందజేస్తారు.

లక్ష్యం.. శతశాతం

100%

- ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు
- చువాన్ పాఠశాల నిర్వహణ
- బూత్ లెవల్ అవేర్‌నెస్ గ్రూపులు

SVEEP



గ్రామీణ ప్రాంత రైతులకు స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల్లో ఉభయ జిల్లాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడం కోసం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. గత ఎన్నికల్లో రాష్ట్ర సగటు కంటే ఓటింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ నోడల్ అధికారిని నియమించారు. చువాన్ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్ర సమయంలో సంబంధిత గ్రామాల్లో చిన్నచిన్న సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఎల్‌ఓతోస్థానిక ఉపాధ్యాయుడు లేదా వయోజన విద్య ప్రేరక్ సహకారంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు, యువత, వికలాంగుల ఓటింగ్ శాతాన్ని మెరుగు పరిచేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బులు

ఉభయ జిల్లాల్లోని అన్ని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో భావి ఓటర్లయిన 14–17 సంవత్సరాల విద్యార్థులతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నారు. 18 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సుగల విద్యార్థుల కోసం అన్ని డిగ్రీ, ప్రొఫెషనల్ కళాశాలల్లో వేర్వేరుగా క్యాంపస్ అంబాసిడర్లుగా విద్యార్థుల్లోనే కొందరిని ఎంపిక చేశారు. అవగాహన, చురుకుదనం, ప్రసంగ నైపుణ్యం కలిగిన విద్యార్థులను అంబాసిడర్లుగా నియమిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటింగ్ తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాల్లో వీరు పర్యటించి ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని రిటర్నింగ్ అధికారి పోలింగ్ కేంద్ర స్థాయిలో స్వీప్ కార్యకలాపాల నిర్వహణకు బూత్ లెవెల్ అవేర్‌నెస్ గ్రూపులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, యానిమేటర్లు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ సచివాలయ సంక్షేమ కార్యదర్శి, విలేజ్ పోలీసు మద్దతుతో బీఎల్‌ఓలు కన్వీనర్లుగా ఈ అవేర్‌నెస్ గ్రూపులు ఏర్పాటయ్యాయి. రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో మండల స్థాయి మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగానికి సమాచారం ఇవ్వడం, బూత్ లెవెల్‌లో ఓటర్ల నమోదు, ప్రజల్లో అవగాహన కోసం వీధి నాటకాలు, ఆటలు, క్విజ్‌లు తదితర పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్‌కు వారం రోజుల ముందు ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. ఎన్నికల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సి-విజిల్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, సాక్ష్యం యాప్, నో యువర్ క్యాండియేడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంపై ఓటర్లలో ఈ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

వర్క్‌షాప్‌లు నిర్వహించాలి

ఇంటింటి ప్రచారాలు, టాంటాం వేయించడం, ఈవీఎం, వీవీ ప్యాట్లపై డెమోలు నిర్వహించాలి. కరపత్రాల పంపిణీ, పాఠశాలలు, కళాశాలల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. ఎస్‌ఎంఎస్, వాట్సాప్ సందేశాల ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంటుంది. గ్రామసభలు, ర్యాలీలు, కళాజాతాలు, ప్రముఖ కూడళ్లలో బ్యానర్లు, హోర్డింగ్‌లను ప్రదర్శించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. లోకల్‌మీడియాలో ప్రకటనలు, మానవహారాలు, సినిమా థియేటర్లలో ప్రకటనల ద్వారా చైతన్యం కల్పిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులు, వృద్ధులు, మహిళలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

మహిళపై దాడి

మదనపల్లె : స్థల వివాదంలో మహిళపై వరుసకు తమ్ముడయ్యే వ్యక్తి దాడిచేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ భూమకవారిపల్లెకు చెందిన వెంకటరమణ, రాజమ్మ(60) దంపతులు పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఊరిముందు ఉన్న ఖాళీస్థలంలో పశువులను కట్టేసేవారు. ఆ స్థలం తనదంటూ రాజమ్మ చిన్నాన్న కొడుకైన వెంకటరమణ, ఆమెపై దాడికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా కొట్టడంతో స్థానికులు ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. తులసంవారిపల్లెకు చెందిన మల్లికార్జున భార్య ఈ.ఉమ(30) భర్త మద్యానికి అలవాటుపడి తరచూ గొడవ పడుతుండటాన్ని భరించలేక మనస్తాపంతో ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నర్సరీకి నిప్పు



కాలిపోయిన నర్సరీ వద్ద విచారంతో క్రిష్ణప్ప

కురబలకోట : గుర్తు తెలియని వ్యక్తులు నర్సరీకి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. బాధితుడు కంటి క్రిష్ణప్ప తీవ్రంగా నష్టపోయాడు. ముదివేడు దగ్గర రామక్రిష్ణాపురం వద్ద రోడ్డు పక్కన కంటి క్రిష్ణప్ప 20 ఏళ్లుగా నర్సరీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అతను నర్సరీ వద్ద లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. శుక్రవారం వచ్చి చూడగా కాలిపోయి కన్పించింది. క్రేట్‌లు, నార్లు, ఎరువులు, వైర్లు, నర్సరీ ఫెన్సింగ్, పైకప్పు మొత్తం కాలిపోయి తీవ్రంగా నష్టపోయినట్లు బాధితుడు ముదివేడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత కక్షలతో సమీప బంధువులే నిప్పుపెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాలని కోరారు.

వెయ్యి నెలల పుణ్య ఫలం బడీరాత్

- నేడు రంజాన్ లైలతుల్ ఖదర్
- రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు
- వెయ్యి నెలలు ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్యం లభిస్తుందంటున్న మౌల్వీలు





ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ/రాజంపేట టౌన్ : లైలతుల్ ఖదర్...వెయ్యి నెలలకు పైగా అల్లాహ్ స్మరణం, దువా, ప్రత్యేక ప్రార్థనలు చేసిన పుణ్య ఫలం లభించే రేయి. దీనిని ముస్లింలు 'బడీరాత్' (పెద్దరాత్రి) అని కూడా అంటారు. పవిత్ర రంజాన్ మాసంలో లైలతుల్ ఖదర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. రాత్రి ఇషా నమాజ్ నుంచి తెల్లవారు జామున సహెరి వేళ వరకు ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతారు. పగలంతా రోజా ఉంటారు. రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తరావీహ్ నమాజ్, బయాన్, హదీస్, ఖురాన్ తిలావత్, సలాతుల్ తజ్బీ, తహజ్జూద్ నమాజ్, దువా ఇలా రేయంతా అల్లాహ్ ఆరాధనలో గడుపుతారు. తమ కష్ట,నష్టాలు విన్నించుకుంటారు. వాటిని దూరం చేయాలని వేడుకుంటారు. పాపాలను దహించాలని మొరపెట్టుకుంటారు. తోబా, అస్తగ్ ఫిరుల్లా చదివి తప్పుల నుంచి క్షమాపణ కోరి, నరకం, నరకాగ్ని నుంచి ముక్తి కోరుతారు. ఒక తల్లి ప్రేమ కంటే 70 రెట్లు అధికంగా ప్రేమ చూపే అల్లాహ్..పిల్లల తప్పులను తల్లి క్షమించినట్లు అనంత కరుణామయుడు కూడా మనుషుల మొర విని కరిగిపోతారు. చేసిన పాపాలు, తప్పులను క్షమించి, ముక్తి కలిగిస్తారు. శనివారం జాగరణ చేస్తే ఒకటి రెండు కాదు ఏకంగా వెయ్యి నెలలకు పైగా ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్య ఫలాన్ని అందిస్తారు. అదే లైలతుల్ ఖదర్ విశిష్టత అని మౌల్వీలు అంటున్నారు.

వెయ్యి నెలల పుణ్యం ఎందుకంటే?

మహమ్మద్ ప్రవక్త (నబీ) సొల్లెల్లాహు అలైహివసొల్లం కంటే పూర్వం ఉన్న ప్రవక్తల కాలంలో మనుషుల ఆయుష్షు వందల ఏళ్లు ఉండేదని హదీసుల ద్వారా తెలుస్తోంది. నాటి ముస్లింలు వందల ఏళ్లు ఆధ్యాత్మికంగా గడిపి స్వర్గానికి మార్గం ఏర్పాటు చేసుకునేవారు. అయితే ఆయుష్షు రానురాను మరింత తగ్గుతుందని, నాటి ప్రవక్తల కాలంలో ఉమ్మత్ సంపాదించుకున్న పుణ్యంతో పోల్చితే తన ఉమ్మత్ (ప్రవక్త సూచించిన మార్గాలను అనుసరించే మనుషులు) పుణ్యం తక్కువగా ఉంటుందని భావించారు మహమ్మద్ ప్రవక్త. ఈ విషయంపై అల్లాహ్‌ను వేడుకుంటూ... ఆయుష్షు తక్కువగా ఉన్న తన ఉమ్మత్‌కు అధికంగా పుణ్యం లభించే మార్గాలు చూపినా మహమ్మద్ ప్రవక్త సంతృప్తి చెందకపోవడంతో చివరకు లైలతుల్ ఖదర్‌ను తెస్తున్నట్లు అల్లాహ్ ప్రకటించారు. ఈ లైలతుల్ ఖదర్ రాత్రంతా జాగారణ చేసి, ఆధ్యాత్మికంగా గడిపిన వ్యక్తికి వెయ్యి నెలలకు పైగా స్మరించుకున్న పుణ్యం ఇవ్వనున్నట్లు చెబుతారు. దైవదూతలందరూ భూమిపైకి వచ్చి ఆధ్యాత్మికంగా గడిపే వారితో కరచాలనం చేసుకుని 'అల్లాహ్ మీ ప్రార్థనలు అంగీకరించారని' అభినందిస్తారని తెలుస్తోంది.

చివరి దశకంలోనే లైలతుల్ ఖదర్

రంజాన్‌లోని ఆఖరి అష్ర (చివరి పది రోజులు) లోనే లైలతుల్ ఖదర్ దాగి ఉందని మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసాల్లం తన సహచర సహబాలకు సూచించినట్లు పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. మూడు భాగాలుగా ఈ నెలలోని చివరి 'జహన్నం సే ఫనా మాంగ్‌నేకా అష్ర'లో పెద్ద రాత్రి ఉంటుంది. అయితే ఏ రోజున అని స్పష్టత లేదు. అయితే నాలుగవ తాఖ్‌రాత్ అంటే శనివారం రాత్రి లైలతుల్ ఖదర్ పేరుతో అత్యధిక శాతం మంది జాగరణ చేస్తూ ఆధ్యాత్మికంగా గడపడం అనవాయితీగా వస్తోంది.

ప్రత్యేక ప్రార్థనలతో అధిక ఫలితం



పెద్దరాత్రి రోజున జాగరణ చేసి, ఆధ్యాత్మికంగా గడపాలి. నమాజ్, తరావీహ్, నఫిల్ నమాజ్, తహజ్జూద్ వంటి ప్రత్యేక ప్రార్థనలతో అధకంగా ఫలితం లభిస్తుంది. అల్లాహ్ స్మరణతో గడిపితే వెయ్యి నెలలు ఆరాధించిన పుణ్యం లభిస్తుందని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. దైవదూతలంతా భూమిపైకి వచ్చి అల్లాహ్ కోసం ప్రార్థించే వారికి శుభాభినందనలు తెలుపుతారు. – హాఫీజ్ ఇక్బాల్ అహమ్మద్, ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపల్లె

అల్లాహ్ అందించిన పెద్దకానుక



లైలతుల్ ఖదర్ రాత్రి అత్యంత పవిత్రమైనది. ఈరాత్రిని ముస్లింలకు అల్లాహ్ అందించిన పెద్దకానుక. ఈరాత్రే ఖురాన్ భూమిమీదకు అవతరించింది. ముస్లింలందరు బడీరాత్ రోజున ఆధ్యాత్మికంగా గడిపాలి.
– ఎస్.షామీర్‌బాషా, అధ్యక్షుడు, ఖుబా మసీదు, రాజంపేట

కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్

– టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి



తాపీ మేస్త్రీలకు ఉచిత బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి

సిద్దవటం : అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని ఆ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ ఆంథోని ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం రాత్రి భారతి సిమెంట్ కంపెనీ వారి ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సిమెంట్ రోబొటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ గురించి వివరించారు. స్లాబ్‌కు మంచి అనుకూలమైన సిమెంట్ అని, పర్యావరణానికి కూడా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. అనంతరం తాపీ మేస్త్రీలకు 1 లక్ష రూపాయల ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాసులు, సిమెంట్ డీలర్ మదర్ థెరిస్సా ఎంటర్ ప్రైజెస్ వెంకటరామిరెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

లారీ ఢీ – ఒకరి మృతి



పి. శ్రీనివాసులు (ఫైల్)

కురబలకోట : స్కూటీలో ముందు వెళుతున్న వ్యక్తిని వెనుకగా లారీ ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన విచారకర సంఘటన కురబలకోట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి కథనం మేరకు..మండలంలోని దొమ్మన్నబావి దగ్గరున్న ఎనుములవారిపల్లెకు చెందిన పి. శ్రీనివాసులు (28) సీజనల్ వ్యాపారం చేసేవాడు. ఇతను శుక్రవారం మధ్యాహ్నం ఊరికి దగ్గరలో రిషివ్యాలీ క్రాస్ వద్ద హైవే పక్కన ఉన్న బంధువుల హోటల్ వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి స్కూటీపై వస్తుండగా వెనుకగా వచ్చిన లారీ ఒక్కసారిగా ఇతన్ని ఢీ కొట్టింది. అతను ఎగిరి పడ్డాడు. అతని మీదుగా లారీ చక్రం దూసుకు వెళ్లడంతో శరీరం ఛిద్రమైంది. ఇతనికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉంది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్. శేఖర్ తెలిపారు. మదనపల్లి మండలం చీకలబైలుకు చెందిన వెంకటరమణప్ప కుమారుడు జె.శ్రీనివాసులు (52) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రవికుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశారన్నారు. ఈ దాడిలో 144 (90ఎం ఎల్) టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం (12.96) లీటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విలువ రూ.5761 ఉంటుందని తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

900 లీటర్ల సారా ఊట ధ్వంసం

పీలేరురూరల్ : 900 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సెబ్ సీఐ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని జాండ్ల పంచాయతీ సూర్యానాయక్ తాండా అటవీ ప్రాంతంలో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంలో సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా బట్టీలు గుర్తించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల ఊట ధ్వంసం చేశారు. అలాగే 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన ట్లు సీఐ తెలిపారు.

చిట్టీల డబ్బుల కోసం అడ్వకేట్ ఇంటి ముట్టడి



అడ్వకేట్ జయనారాయణరెడ్డి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడుతున్న సీఐ

మదనపల్లె : చిట్టీల డబ్బులు చెల్లించాలంటూ అడ్వకేట్ ఇంటి ముందు బాధితులు నిరసన తెలిపిన ఘటన శుక్రవారం పట్టణంలోని కృష్ణానగర్‌లో జరిగింది. కజిన్స్‌వీధికి చెందిన వి.సుధాకరరెడ్డి వీఎస్‌ఆర్ ఏజెన్సీ, చిట్స్, ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. 20 ఏళ్లుగా నమ్మకంగా చిట్టీలు నడుపుతుండటంతో చాలామంది ఆయన వద్ద చిట్టీలు వేశారు. ఈ క్రమంలో మూడున్నరేళ్లుగా నడుస్తున్న చిట్టీలకు సంబంధించి పాడుకున్న వారికి కొంత మొత్తం చెల్లించి, మిగిలిన వారికి డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీనిపై ఫిబ్రవరి 27న సుధాకరరెడ్డి ఇంటికి బాధితులు వెళ్లి చిట్టీల డబ్బులు చెల్లించాలని కోరితే... తాను ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, చిట్టీల డబ్బులు వసూలుచేసిన కృష్ణారెడ్డిని అడగాల్సిందిగా చెప్పాడు. ఈ విషయమై వారు కృష్ణారెడ్డిని అడిగితే...తాను చిరుద్యోగిని మాత్రమేనని, వసూలుచేసిన డబ్బులు సుధాకరరెడ్డికే ఇచ్చానని, బాధితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వి.సుధాకరరెడ్డి, కృష్ణారెడ్డి, మరో ఇద్దరిపై కేసు నమోదుచేశారు. కేసు విచారణలో ఉండగా, బాధితులతో రాజీ కుదుర్చుకునే ప్రయత్నంలో వి.సుధాకరరెడ్డికి కొంతమందికి చిట్టీల డబ్బులు చెల్లించారని, ఈ తతంగం మొత్తం నిందితుడు సుధాకరరెడ్డి అన్న అడ్వకేట్ జయనారాయణరెడ్డి చూస్తున్నాడని తెలియడంతో శుక్రవారం బాధితులు అతడి ఇంటికి వెళ్లారు. డబ్బులు చెల్లించాల్సిందిగా కోరారు. దీనిపై అడ్వకేట్ జయనారాయణ తమ ఇంటిముందు గొడవ చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదుచేయడంతో వన్‌టౌన్ సీఐ వలీబాషు, తాలూకా సీఐ ఎస్.శేఖర్ అక్కడకు చేరుకుని బాధితులను అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించారు. కాగా బాధితులు తమకు న్యాయం చేయాలని కోరారు.

టీడీపీని వీడిన జిల్లా అధికార ప్రతినిధి



నేట్లపల్లె సోదరులను ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

మైదుకూరు : మైదుకూరు మండలంలో టీడీపీకి గట్టి దెబ్బ తగిలింది. శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లె శివరాం, ఆయన సోదరుడు టీడీపీ బీసీ విభాగం మండల నేత నేట్లపల్లె రామాంజనేయులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వారిరువురికి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మైదుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేట్లపల్లె సోదరులను కోరారు. నేట్లపల్లె శివరాం మాట్లాడుతూ 15 ఏళ్లుగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. అయితే పుట్టా సుధాకర్ యాదవ్ కులంతో రాజకీయం చేయాలని భావిస్తున్నారని.. బీసీల్లో ఉన్న నాయీబ్రాహ్మణ, కమ్మరి, రజక, ఉప్పర తదితర కులాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాడని, నాయకులుగా వారిని ఎదగనివ్వడం లేదని ఆరోపించారు. మైదుకూరు నియోజకవర్గం టికెట్‌ను టీడీపీ ఒక అసమర్థుడు, అవినీతిపరునికి ఇవ్వడం వల్లే తాము టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న వారిని పుట్టా అణగదొక్కుతున్నాడని ధ్వజమెత్తారు. పుట్టా ఎక్కడో కాంట్రాక్టు పనులు చేసుకుంటున్న సమయంలో సర్పంచ్‌గా, ఎంపీపీగా ఉన్న మెట్రిమేకల గురవయ్య యాదవ్‌ను పార్టీలోకి వచ్చాక అణకదొక్కాడని ఆరోపించారు. ఖాజీపేటకు చెందిన మల్లె ఓబయ్య, పుట్టా రాజకీయ రంగ ప్రవేశానికి కారకుడైన మల్లికార్జున యాదవ్‌ను.. ఇంకా అనేకమందిని పుట్టా ఎదగనివ్వలేదని మండిపడ్డారు. పుట్టాను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ గౌస్ లాజం, ఎంపీపీలు వీరనారాయణ రెడ్డి, లక్షుమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గోపవరం : గోపవరం మండల పరిధిలోని టి.సంద్రపల్లె పంచాయతీ బుచ్చనపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుచ్చనపల్లె గ్రామానికి చెందిన రామా పురం పెంచలయ్య, పోలిరెడ్డిగారి యల్లారెడ్డి, పునగాని పెద్దన్న, నాగమునితో పాటు మరో 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చెన్నూరు : మండలంలోని శాటిలైట్ సిటీలో జింక లక్షుమ్మ (45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. సీఐ పార్థసారథి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతి చెందిన మహిళ భర్త మురళీ గంగాధర్ అని ఆయన తెలిపారు. కాగా ఆ మహిళ శరీరమంతా ఉబ్బి నీరు కారుతోందని.. మూడురోజుల కిందట మరణించినట్లుగా సంఘటనా స్థలాన్ని బట్టి చూస్తే తెలుస్తోందన్నారు. లక్షుమ్మ 15 సంవత్సరాల క్రితం భర్త నుండి విడిపోయి ఒంటరిగా జీవిస్తోందన్నారు. ఆమెది ఒంటిమిట్ట మండలం, మాధవరం స్వగ్రామమని, రెండు సంవత్సరాల నుంచి శాటిలైట్ సిటీలోని 12వ బ్లాక్‌లో మూడవ అంతస్తులో నివాసం ఉంటోందని తెలిపారు. ఆమె మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



చలమారెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



44వ డివిజన్‌లో పార్టీలో చేరిన వారితో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



చాంద్‌బాషాకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని చలమారెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీ నుంచి 100 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం వారికి ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డిలు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన చల్లా పవన్, నంద్యాల సాయి, వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, చంద్రమ్మ, వెంకటమ్మ, రాజేశ్వరి, అంజనమ్మ, శిరీష, వెంకటసుబ్బయ్య, లక్ష్మయ్య, తేజ , కాశీ, వెంకటేష, రాము, సుధాకర్, శ్రీనివాసులు, వంశీ, శివ రామక్రిష్ణలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, బాలకొండయ్య, నగర అధ్యక్షుడు ఎన్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, మాస్టర్ అహ్మద్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో....

కడప నగరంలోని 44వ డివిజన్ పరిధిలో టీడీపీ నుండి 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహమ్మద్ స్కూల్ డైరెక్టర్ అబ్దుల్ కబీర్, మహమ్మద్ అబ్దుల్ అజీజ్ అక్రమ్ వారి మిత్రబృందం పార్టీలో చేరారు. ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాష, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కడప మేయర్ కే.సురేష్ బాబు , ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎన్. సుబ్బారెడ్డి సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, షఫీ, జీజేరెడ్డి, ఎల్లారెడ్డి , షేక్ జమీల్, ఫయాజ్, షఫీ,రమేష్ రెడ్డి, మాస్టర్ అహ్మద్, మున్నా , అఖిల్, చాంద్ బాషా, నాగ మల్లారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

పోరుమామిళ్ల : అక్కలరెడ్డిపల్లెలో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు కప్పి గోవిందరెడ్డి వారిని పార్టీలో చేర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో పీఆర్ ఆర్‌డీ సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గురయ్య, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఏజీసీ కన్వీనర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో 100 కుటుంబాలు చేరిక

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక 17వ వార్డులోని నడింపల్లెలో శుక్రవారం రాత్రి నడింపల్లె చాంద్ బాషా, ఆయన సతీమణి, మాజీ కోఆప్షన్ మెంబర్ గౌసియాతోపాటు 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి కండువాలు వేసి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం చాంద్ బాషా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఫరీద్ బాషా, నన్నేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం



మృతి చెందిన సుజాత

వారిద్దరూ దంపతులు.. అన్యోన్యంగా జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కష్టపడి వ్యవసాయం చేస్తున్నారు. ఒక కుమారుడికి వివాహం చేశారు. ఇంకో కొడుకు, కూతురిని చదివిస్తున్నారు. బిడ్డలను ఉన్నతంగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఆ భార్యాభర్తలు కన్న కలలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. ఇద్దరినీ కబళించింది. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో వారి పిల్లల రోదనను చూసిన స్థానికులు కన్నీటిపర్యంతం అయ్యారు.



మృతి చెందిన పుల్లయ్య

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

దువ్వూరు : దువ్వూరులోని కడప–కర్నూలు జాతీయ రహదారిపై పుల్లారెడ్డి పేట పెట్రోలు బంకు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన పందిటి పుల్లయ్య (56), అతని భార్య పందిటి సుజాత (54) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లయ్య, సుజాత దంపతులు మండలంలోని వెంకుపల్లె గ్రామంలోని బంధువుల సీమంతం ఫంక్షన్‌కు వచ్చి తిరిగి వారి గ్రామానికి స్కూటర్‌పై వెళుతుండగా.. పుల్లారెడ్డి పేట పెట్రోలు బంకు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వారి స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో గాయపడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పుల్లయ్య మృతి చెందాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున సుజాత కూడా మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుల్లయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఒక కుమారుడికి వివాహం చేశాడు. ఇంకో కొడుకు, కూతురిని చదివిస్తున్నాడు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆ దంపతులు పెంచుకున్న ఆశలు అడియాశలయ్యాయి. రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్న ఇద్దరూ చనిపోవడంతో వారి పిల్లలు గుండెలవిసేలా రోదిస్తుంటే వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.